10, 12 తరగతులకు డివిజన్లు ఇవ్వం

సీబీఎస్‌ఈ కీలక ప్రకటన

న్యూఢిల్లీ, డిసెంబర్ 1: 10, 12వ తరగతి బోర్డు పరీక్షలకు సంబంధించి సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్‌ఈ) కీలక ప్రకటన చేసింది. విద్యార్థులకు డివిజన్లు, డిస్టింక్షన్లు ఇవ్వబోమని స్పష్టం చేసింది. 'డివిజన్, డిస్టింక్షన్, అగ్రిగేట్ మార్క్స్ లాంటివేవీ టెన్త్, ఇంటర్ విద్యార్థులకు ఇవ్వం. విద్యార్థి 5 కంటే ఎక్కువ సబ్జెక్టులు ఎంచుకొంటే ఉత్తమమైన ఐదింటిని మాత్రమే పాఠశాల పరిగణనలోకి తీసుకొంటుంది' అని సీబీఎస్‌ఈ ఎగ్జామినేషన్ కంట్రోలర్ సన్యం భరద్వాజ్ శుక్రవారం తెలిపారు. మార్కుల శాతాలను బోర్డు లెక్కించదని చెప్పారు. అయితే, ఉన్నత విద్య, ఉద్యోగం కోసం విద్యార్థికి వచ్చిన మార్కుల్లో శాతాన్ని లెక్కించాల్సి వస్తే ఆ విద్యార్థి చదివిన పాఠశాల మాత్రమే ఆ పని చేస్తుంది.

4న మిజోరం ఓట్ల లెక్కింపు

న్యూఢిల్లీ, డిసెంబర్ 1: మిజోరం శాసనసభ ఎన్నికల ఓట్ల లెక్కింపును కేంద్ర ఎన్నికల కమిషన్ వాయిదా వేసింది. ఈ నెల 4న కౌంటింగ్ నిర్వహించనున్నట్టు తెలిపింది. షెడ్యూలు ప్రకారం ఈ ఓట్ల లెక్కింపు 3న జరగవలసి ఉంది. అయితే క్రైస్తవులు అధికంగా గల ఈ రాష్ట్రంలో ఆదివారానికి చాలా ప్రత్యేకత ఉందని, అందువల్ల ఓట్ల లెక్కింపును వాయిదా వేయాలని విజ్ఞప్తులు రావడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఈసీ తెలిపింది. రాజస్థాన్, మధ్యప్రదేశ్, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ శాసనసభ ఎన్నికల ఓట్ల లెక్కింపు షెడ్యూలు ప్రకారం ఆదివారమే జరుగుతుంది.

2028 కాప్33కి భారత్ ఆతిథ్యం!

దుబాయ్: దుబాయ్‌లో జరుగుతున్న ఐక్యరాజ్య సమితి వాతావరణ సదస్సు కాప్ 18లో ప్రధాని నరేంద్ర మోదీ కీలక ప్రతిపాదన చేశారు. 2028లో జరిగే వాతావరణ సదస్సు కాప్33కి భారత్ ఆతిథ్యం ఇవ్వాలనుకుంటున్నట్టు ప్రకటించారు. ఈ సందర్భంగా ప్రజల భాగస్వామ్యం ద్వారా కార్బన్ ఉద్గారాలను తగ్గించే గ్రీన్ క్రెడిట్ ఇనీషియేటివ్‌ను ప్రస్తావించారు. కాప్18 సదస్సుకు వివిధ దేశాల అధ్యక్షులు, ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సమావేశంలో మోదీ మాట్లాడుతూ అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ మధ్య సమతూకం పాటించడంలో ప్రపంచ దేశాలకు భారత్ గొప్ప ఉదాహరణగా నిలిచిందన్నారు.

సెల్ఫీ పాయింట్లతో కేంద్రానికి ప్రచారం!

విద్యా సంస్థలకు యూజీసీ ఆదేశాలు

న్యూఢిల్లీ, డిసెంబర్ 1: సెల్ఫీ పాయింట్లు ఏర్పాటుచేసి కేంద్ర పథకాలకు ప్రచారం చేయాలని సైన్యానికి ఇటీవల కేంద్ర సర్కారు ఆదేశాలివ్వడం తీవ్ర వివాదాస్పదమైన విషయం తెలిసిందే. అయితే తాజాగా యూనివర్సిటీలకు, కాలేజీలకు యూజీసీ ఇదే తరహా ఆదేశాలివ్వడం చర్చనీయాంశం అవుతున్నది. వివిధ రంగాల్లో దేశం సాధించిన ప్రగతిని వివరించేలా యూనివర్సిటీలు, కాలేజీల్లో సెల్ఫీ పాయింట్లు ఏర్పాటుచేయాలని యూజీసీ తాజా ఆదేశాల్లో పేర్కొన్నది. ఈ సెల్ఫీ పాయింట్లు కేంద్ర విద్యాశాఖ షేర్ చేసిన 3డీ లే అవుట్ డిజైన్స్‌కు అనుగుణంగా ఉండాలని సూచించింది. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన జాతీయ విద్యావిధానం, ఏక్‌భారత్ శ్రేష్ఠ్ భారత్ వంటి కార్యక్రమాల ఇతివృత్తాలను వివరించేలా ఈ సెల్ఫీ పాయింట్లు ఉండాలని స్పష్టంచేసింది.

గవర్నర్‌కు ఆ అధికారం లేదు

అసెంబ్లీ రెండోసారి ఆమోదించిన బిల్లులను రాష్ట్రపతికి గవర్నర్ పంపలేరు

- రాజ్యాంగంలోని ఆర్టికల్ 200 ఇదే చెబుతున్నది
- తమిళనాడు గవర్నర్ ఆర్‌ఎన్ రవికి సుప్రీంకోర్టు స్పష్టీకరణ
- సీఎం స్టాలిన్‌తో కూర్చొని పెండింగ్ బిల్లులపై చర్చించండి
- వీలైనంత త్వరగా ప్రతిష్ఠంభనకు తెరదించాలని సూచన

న్యూఢిల్లీ, డిసెంబర్ 1: ఒకసారి ఆమోదాన్ని నిలుపుదల చేసిన తర్వాత రాష్ట్ర అసెంబ్లీ రెండోసారి ఆమోదించిన బిల్లులను రాష్ట్రపతి ఆమోదానికి గవర్నర్ పంపలేరని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. తమిళనాడులోని స్టాలిన్ సర్కార్ వేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా న్యాయస్థానం ఈ మేరకు రాజ్యాంగంలోని ఆర్టికల్ 200ను ప్రస్తావించింది. 10 పెండింగ్ బిల్లుల ఆమోదం విషయంలో గవర్నర్ ఆర్‌ఎన్ రవి, ఎంకే స్టాలిన్ సర్కార్ మధ్య నెలకొన్న ప్రతిష్ఠంభనను తొలగించేందుకు న్యాయస్థానం శుక్రవారం పలు కీలక సూచనలు చేసింది. ప్రతిష్ఠంభనను పరిష్కరించేందుకు సీఎం స్టాలిన్‌తో సమావేశమై చర్చించాలని గవర్నర్ రవిని కోరింది. సీఎంతో కలసి చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకొంటే అభినందిస్తామని పేర్కొన్నది. 'బిల్లుల ప్రతిష్ఠంభనకు గవర్నర్ తెరదించాలని కోరుకుంటున్నాం. ఈ విషయంలో సీఎంతో కలిసి నడిస్తే మేం అభినందిస్తాం. సీఎంను గవర్నర్ ఆహ్వానించి, ఆయనతో కూర్చొని పెండింగ్ బిల్లుల విషయంపై చర్చలు జరుపుతారని ఆశిస్తున్నాం' అని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్థివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రా ధర్మాసనం పేర్కొన్నది. బిల్లులను ఆమోదించడంలో గవర్నర్ రవి జాప్యం చేస్తున్నారని పేర్కొంటూ స్టాలిన్ సర్కార్‌ను వేసిన పిటిషన్‌పై న్యాయస్థానం విచారణ జరిపింది.

ఇది రాజ్యాంగ ఉల్లంఘనే..

తిప్పిపంపిన బిల్లులను అసెంబ్లీ రెండోసారి ఆమోదించి పంపిందని, అయితే ఆ బిల్లులను గవర్నర్ ఆమోదించకుండా రాష్ట్రపతి పరిశీలన కోసం పంపారని రాష్ట్ర ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ చేసిన వాదనలను న్యాయస్థానం పరిగణనలోకి తీసుకొన్నది. గవర్నర్ రవి మొండిగా వ్యవహరిస్తున్నారని సింఘ్వీ ఆరోపించారు. రెండోసారి ఆమోదించి పంపిన బిల్లులను కూడా ఎక్కువ కాలం తొక్కిపెట్టిన గవర్నర్.. వాటిని గత నెల 28న రాష్ట్రపతికి పంపారని కోర్టుకు తెలిపారు. ఇది స్పష్టమైన రాజ్యాంగ ఉల్లంఘనేనని వాదించారు. రాజ్‌భవన్ తరఫున అటార్నీ జనరల్ ఆర్ వెంకటరమణి వాదనలు వినిపించారు. గవర్నర్ బిల్లులను తిప్పిపంపినప్పుడు, వాటిని ఆమోదాన్ని నిలుపుదల చేయలేదని, పునఃపరిశీలన కోసం మాత్రమే పంపారని అన్నారు. బిల్లుపై తమ వైఖరి మార్చుకోవడం లేదని అసెంబ్లీ చెప్పిన సమయంలో.. గవర్నర్ అప్పుడు దాన్ని రాష్ట్రపతికి పంపవచ్చని వాదించారు.

ఆర్‌ఎన్ రవి

రెండోసారి అలా చేయలేరు!

ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం గవర్నర్ అధికారాలపై కీలక వ్యాఖ్యలు చేసింది. రాజ్యాంగంలోని ఆర్టికల్-200ను ప్రస్తావిస్తూ.. మొదటిసారి అసెంబ్లీ ఆమోదించి పంపిన బిల్లులను రాష్ట్రపతికి గవర్నర్ పంపొచ్చని, అయితే వాటిని తిప్పిపంపి, అసెంబ్లీ మరోసారి ఆమోదించిన సమయంలో మాత్రం రాష్ట్రపతికి పంపే అధికారం లేదని స్పష్టం చేసింది. 'ఆర్టికల్ 200 ప్రకారం గవర్నర్‌కు మూడు ఎంపికలు ఉంటాయి. బిల్లును ఆమోదించవచ్చు లేదా ఆమోదాన్ని నిలుపుదల చేయవచ్చు లేదా రాష్ట్రపతికి పంపవచ్చు. అయితే ప్రస్తుత సందర్భంలో మాత్రం ఆమోదాన్ని నిలుపుదల చేశానని గవర్నర్ మొదట చెప్పారు. ఒకసారి ఆమోదాన్ని నిలిపివేసిన తర్వాత.. సంబంధిత బిల్లులను రాష్ట్రపతికి రిజర్వ్ చేసే ప్రశ్నే ఉండదు. బిల్లును నిలుపుదల చేయలేరు' అని న్యాయస్థానం పేర్కొన్నది. ఆమోదాన్ని నిలుపుదల చేసిన తర్వాత బిల్లును గవర్నర్ తిరిగి అసెంబ్లీకి పంపకుంటే.. అది బిల్లును పూర్తిగా నిరర్థకం చేయడమేనని వ్యాఖ్యానించింది. కాగా, గత విచారణ సందర్భంగా తమిళనాడు గవర్నర్ తీరుపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. బిల్లుల ఆమోదంపై మూడేండ్లుగా ఏం చేస్తున్నారని ప్రశ్నించిన ధర్మాసనం.. రాష్ట్ర ప్రభుత్వం న్యాయస్థానం మెట్లు ఎక్కే వరకు ఏం చేస్తున్నారని అసహనం వ్యక్తం చేసింది.

కర్ణాటకలో మత్స్య పరిశ్రమ కుదేలు!

కరెంటు కొరతతో పడిపోయిన ఐస్ ఉత్పత్తి

చేపల రవాణా, ప్రాసెసింగ్‌కు తీవ్ర ఇబ్బందులు

ఆదాయం తగ్గిందని జాలర్లు, పరిశ్రమల ఆవేదన

మంగళూరు, డిసెంబర్ 1: కాంగ్రెస్ పాలిత కర్ణాటకలో కరెంటు కోతలు జాలర్ల ఉపాధిపై తీవ్ర ప్రభావం చూపిస్తున్నాయి. చేపల నిల్వ, రవాణాలో కీలకమైన ఐస్ ఉత్పత్తికి కరెంటు కోతల వల్ల ఆటంకం ఏర్పడటంతో మత్స్యకారులు తక్కువ రేటుకు చేపలు అమ్ముకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. దక్షిణ కన్నడ, ఉత్తర కన్నడ, ఉడిపి జిల్లాల్లో కరెంటు కోతల ప్రభావం వల్ల ఐస్ ఫ్యాక్టరీలు, చేపల ప్రాసెసింగ్ యూనిట్లు సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. 'ఆగస్టు నుంచి కరెంటు సంక్షోభం కొనసాగడం వల్ల ఐస్ ఫ్యాక్టరీలు కేవలం 30 శాతం సామర్థ్యంతో పనిచేస్తున్నాయి' అని కరావళి మీనుగరర క్రియా సమితి సభ్యుడు హరీశ్ సాలియన్ అన్నారు. కరెంటు సంక్షోభం వల్ల ఒమేగా-3 ఆయిల్ ఎక్కువగా ఉండే సార్డైన్ చేపలను భారీ స్థాయిలో ఐస్‌లో నిల్వ చేసి విలువ జోడింపు ప్రాసెసింగ్ యూనిట్లకు జాలర్లు తరలించలేకపోతున్నారు. రూ.160-180 ధర పలికే ఈ చేపలను రూ.100-120లకు ఫిష్ మీల్ పరిశ్రమలకు అమ్ముకుంటున్నారు. ప్రాసెసింగ్ యూనిట్లకు చేపలను తరలించేటప్పుడు ఐస్ లేని పరిస్థితుల్లో జాలర్లు గత్యంతరం లేక వాటిని ప్రాసెసింగ్ యూనిట్లు చెల్లించే ధర కంటే 60 శాతం తక్కువ ధరకు స్థానికంగా అమ్ముకోవాల్సి వస్తున్నది.

165 ఐస్ ప్లాంట్లపై ప్రభావం

కరెంటు కోతల వల్ల తీర ప్రాంతంలో 165 ఐస్ ఫ్యాక్టరీలపై ప్రభావం పడింది. రోజుకు 2,200 టన్నుల సామర్థ్యం కలిగిన ఈ ఫ్యాక్టరీలు ప్రస్తుతం రోజుకు 1900 టన్నుల ఐస్‌ను మాత్రమే ఉత్పత్తి చేయగలుగుతున్నాయి. ఐస్ కొరత ప్రాసెసింగ్ యూనిట్లపైనా ప్రభావం చూపిస్తున్నది. డీజిల్ జనరేటర్లతో యూనిట్లను నడిపితే తక్కువ లాభాలు వస్తున్నాయని దక్షిణ కన్నడ ఐస్ ప్లాంట్స్ సహకార సంఘం డైరెక్టర్ మోహన్ బెంగ్రే తెలిపారు. చిన్న జాలర్ల బృందాలు, సహకార సంఘాలు జనరేటర్ల ద్వారా తమ ఫ్యాక్టరీలను నడిపించే స్థితిలో లేరని జాలర్ల నాయకులు తెలిపారు. దక్షిణ కన్నడ, ఉడిపి జిల్లాల్లో ఏటా 80 వేల టన్నుల చేపలను పడతారు. వాటిలో 30 శాతం మాత్రమే విదేశాలకు ఎగుమతి చేస్తారు. కానీ ఐస్ తగినంత లభించక ఎగుమతులకూ ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

బొగ్గు దిగుమతికి ఒత్తిడేల?

రాష్ట్రాలకు కేంద్రం ఆదేశాలపై మాజీ బ్యూరోక్రాట్ ఈఏఎస్ శర్మ ప్రశ్నలు

ప్రైవేటు కంపెనీల అనుచిత లబ్ధికే

కేంద్ర క్యాబినెట్ కార్యదర్శికి లేఖ

ఈఏఎస్ శర్మ

న్యూఢిల్లీ: విదేశాల నుంచి బొగ్గు దిగుమతి చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ విద్యుత్తు సంస్థలపై కేంద్రం ఒత్తిడి తీసుకురావడంపై పలు ప్రశ్నలు లేవనెత్తుతూ మాజీ బ్యూరోక్రాట్, కేంద్ర ప్రభుత్వ మాజీ కార్యదర్శి ఈఏఎస్ శర్మ కేంద్ర క్యాబినెట్ కార్యదర్శి రాజీవ్ గౌబాకు లేఖ రాశారు. ఈ సందర్భంగా ఆయన పంజాబ్ స్టేట్ పవర్ కార్పొరేషన్ లిమిటెడ్(పీఎస్‌పీసీఎల్) అంశాన్ని ప్రస్తావించారు. జార్ఖండ్‌లోని పచ్వారాలో తన సొంత గని నుంచి బొగ్గును తెచ్చుకొనేందుకు పీఎస్‌పీసీఎల్ కోరగా.. అందుకు నిరాకరించిన కేంద్ర విద్యుత్తు శాఖ విదేశాల నుంచి బొగ్గును దిగుమతి చేసుకోవాలని ఒత్తిడి చేసిందని అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ దిగుమతి చేసుకొనే బొగ్గు వల్ల(పీఎస్‌పీసీఎల్‌కు అవసరమైన బొగ్గులో 6 శాతం) పీఎస్‌పీసీఎల్‌తో పాటు రాష్ట్రంలోని విద్యుత్తు వినియోగదారులపై అధిక భారం పడుతుందని అన్నారు. విదేశాల్లోని గనుల నుంచి బొగ్గును సరఫరా చేసే దేశంలోని కొన్ని కంపెనీలకు అనుచిత లబ్ధి చేకూర్చేందుకే ఇలా చేస్తున్నారని శర్మ ఆరోపించారు. ఈ విధమైన ఒత్తిడి చేయకుండా జోక్యం చేసుకోవాలని ఆయన గౌబాను కోరారు. కృత్రిమ బొగ్గు కొరత సృష్టితో కేంద్రం సెల్లార్స్ మార్కెట్(అమ్మకానికి సరుకు కొరత పరిస్థితి ఫలితంగా అమ్మకందారుడి ధరను నిర్ణయించే శక్తి లభించడం) సృష్టించడం, బొగ్గు దిగుమతికి విద్యుత్తు సంస్థలపై ఒత్తిడి తేవడంపై గతంలో పరిశోధనాత్మక కథనాలు వెలువడ్డాయని పేర్కొన్నారు.

ప్రైవేటు కంపెనీలకు లబ్ధి చేకూర్చేలా

పచ్వారా గని నుంచి బొగ్గు వినియోగానికి రాజ్‌పుర, తల్వాండిలోని ప్రైవేటు విద్యుత్తు సంస్థలను అనుమతించిన కేంద్రం.. పీఎస్‌పీసీఎల్‌కు మాత్రం అనుమతి ఇవ్వలేదన్నారు. దీని వలన పీఎస్‌పీసీఎల్ రావాల్సిన ఆర్థికపరమైన లబ్ధి ప్రైవేటు సంస్థలకు వెళ్లేలా కేంద్రం ఆదేశాలు ఉన్నాయని, ఇది వివక్షతో కూడుకొన్నదని ఆరోపించారు. బొగ్గు దిగుమతుల ద్వారా ప్రైవేటు సరఫరాదారులు, అదేవిధంగా గుజరాత్ పోర్టు ప్రైవేటు ప్రమోటర్లకు లబ్ధి చేకూర్చేలా కేంద్ర విద్యుత్తు శాఖ ఆదేశాలు ఉన్నాయని విమర్శించారు. విదేశాల నుంచి భారత్‌కు బొగ్గు ఎగుమతిలో మోదీ ఆప్త మిత్రుడు అదానీకి చెందిన కంపెనీదే అగ్రస్థానం.

వాణిజ్య సిలిండర్‌పై రూ.21 వడ్డన

ఎన్నికలు ముగిసిన మరుసటి రోజే కేంద్రం పెంపు

న్యూఢిల్లీ, డిసెంబర్ 1: అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన మరుసటి రోజే కేంద్రం వంటగ్యాస్‌పై మోత మొదలుపెట్టింది. వాణిజ్య అవసరాలకు వినియోగించే 19 కిలోల సిలిండర్‌పై రూ.21 పెంచింది. ఈ మేరకు ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు శుక్రవారం ప్రకటించాయి. తాజా పెంపుతో 19 కేజీల సిలిండర్ ధర ఢిల్లీలో రూ.1,796.50, ముంబైలో రూ.1,749, చెన్నైలో రూ.1,968కి చేరింది. గృహావసరాలకు వాడే ఎల్పీజీ సిలిండర్ ధరలు మాత్రం పెరగలేదు. వాణిజ్య సిలిండర్‌పై నవంబర్ 1న రూ.100 పెంచిన కేంద్రం.. అనంతరం నవంబర్ 16న రూ.57 తగ్గించింది. మరోవైపు, జెట్ ఇంధన ధరలను ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు 4.6 శాతం తగ్గించాయి.

అమెరికాలో భారత విద్యార్థిపై అకృత్యం

- తోటి భారతీయుల అమానుషం
- బంధించి.. బలవంతంగా చాకిరీ
- కొన్ని నెలలపాటు చిత్రహింసలు
- ముగ్గురిని అరెస్ట్ చేసిన పోలీసులు

వాషింగ్టన్: అమెరికాలో దారుణం చోటుచేసుకుంది. ఓ భారతీయ విద్యార్థిపై తోటి భారతీయులే అమానుషంగా వ్యవహరించారు. నిర్బంధించి చిత్రహింసలకు గురిచేశారు. తాజాగా పోలీసులు వారిని అరెస్ట్ చేశారు. ప్రాసిక్యూటర్ జో మెక్‌కుల్లోచ్ వెల్లడించిన వివరాల ప్రకారం, భారతీయ విద్యార్థి ఒకరు (20 ఏళ్ల వయసు) గత ఏడాది ఉన్నత చదువు కోసం అమెరికా వెళ్లారు. సెయింట్ చార్లెస్ కౌంటీలో ఉంటున్న వెంకటేశ్ ఆర్ సత్తారు, శ్రావణ్ వర్మ పెనుమెచ్చ, నిఖిల్ వర్మ పెన్మత్స ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఆ విద్యార్థిని నిర్బంధించి, ఇష్టానుసారం కొడుతూ, ఆహారం పెట్టకుండా, నిద్ర పోనివ్వకుండా, వెట్టి చాకిరీ చేయించుకుంటున్నారు. వీరందరికీ భారత్‌లో రాజకీయ పలుకుబడి అధికంగా ఉంది. బాధితుని పరిస్థితిని గమనించిన ఓ వ్యక్తి పోలీసులకు ఫోన్ చేశారు. దీంతో బుధవారం పోలీసులు వీరి ఇళ్లపై దాడి చేసి, బాధితునికి విముక్తి కల్పించారు. బాధితుని ఎముకలు విరిగిపోవడం, శరీరమంతా గాయాలు ఉండటంతో దవాఖానకి తరలించారు. బాధితుడు మాట్లాడుతూ, వెంకటేశ్‌కు తమ దేశంలో రాజకీయ పలుకుబడి ఉందని, చాలా సంపన్నుడని, పోలీసులకు ఫిర్యాదు చేస్తే, తనతోపాటు తన కుటుంబ సభ్యులకు హాని జరుగుతుందని తాను భయపడ్డానని చెప్పారు. మిసోరీ విశ్వవిద్యాలయంలో ఉన్నత విద్యను అభ్యసించడం కోసం తాను ఇక్కడికి వచ్చానని తెలిపారు.

అమెరికా జనాభాలో 15% విదేశీయులే

న్యూయార్క్, డిసెంబర్ 1: అమెరికాలో చట్టబద్ధమైన, చట్ట విరుద్ధమైన విదేశీ జనాభా అక్టోబర్ 2023లో 49.5 మిలియన్‌లుగా నమోదైంది. అయితే అమెరికా అధ్యక్షుడిగా జో బైడెన్ 2021లో బాధ్యతలు స్వీకరించిన తర్వాత రికార్డు స్థాయిలో 45 లక్షల విదేశీ జనాభా పెరిగినట్టు వాషింగ్టన్ కేంద్రంగా నిర్వహించిన ఒక సర్వే వెల్లడించింది. అలాగే అమెరికా చరిత్రలో ఎన్నడూ లేనంతగా మొత్తం దేశ జనాభాలో 15 శాతం విదేశీయులు, వలస వచ్చిన వారేనని 2023 అక్టోబర్ వరకు నిర్వహించిన ఈ సర్వే తెలియజేసింది. ఇప్పటికే దేశంలోకి వస్తున్న అక్రమ వలసదారులపై చర్చ జరుగుతున్న క్రమంలో దేశంలో ఉన్న 25 రాష్ట్రాల జనాభా కన్నా 45 లక్షల వలసదారుల పెరుగుదల ఆందోళన కలిగించే అంశమని ఆ సర్వే పేర్కొంది. ఇలా వలస వచ్చిన వారిలో సౌత్ అమెరికా నుంచి 28 శాతం, సెంట్రల్ అమెరికా నుంచి 25 శాతం, సబ్-సహారన్ ఆఫ్రికా నుంచి 21 శాతం, కరేబియన్ నుంచి 20 శాతం, మిడిల్ ఈస్ట్ నుంచి 14 శాతం మంది ఉన్నారు.

న్యాయం కోసం@526 రోజులు

- యూపీ టీచర్ రిక్రూట్‌మెంట్ ప్రక్రియలో అవకతవకలు
- రిజర్వేషన్ ప్రమాణాల్లో వ్యత్యాసాలు
- న్యాయం చేయాలని 500 రోజులకు పైగా ఆందోళనలు చేస్తున్న వందలాది అభ్యర్థులు
- ప్రభుత్వ నిర్లక్ష్యంతో వారికి నేటికీ దక్కని న్యాయం

ఉత్తరప్రదేశ్‌లో ఆందోళన చేస్తున్న అభ్యర్థులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

డబుల్ ఇంజిన్ ట్రబుల్ ఇంజిన్

లక్నో: బీజేపీ పాలిత ఉత్తరప్రదేశ్‌లో జరిగిన టీచర్ రిక్రూట్‌మెంట్ స్కామ్ బాధిత అభ్యర్థులు తమకు న్యాయం చేయాలని లక్నోలోని ఎకో గార్డెన్‌లో 526 రోజులుగా ఆందోళనలు కొనసాగిస్తున్నారు. అయితే అభ్యర్థుల ఆందోళనలను రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. విజయ్‌కుమార్ అనే అభ్యర్థి మాట్లాడుతూ జాతీయ వెనుకబడిన తరగతుల కమిషన్ నివేదికను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. 2021, ఏప్రిల్ 19న కమిషన్ ఇచ్చిన నివేదికలో 69 వేల మంది టీచర్ల రిక్రూట్‌మెంట్‌లో రిజర్వేషన్ స్కామ్ జరిగినట్టు నిర్ధారించిందని, ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ కూడా పంపిందని పేర్కొన్నారు. కుంభకోణం కారణంగా ప్రభావితమైన అభ్యర్థులకు అపాయింట్‌మెంట్ లెటర్లు ఇవ్వాలని కూడా సూచించిందని అన్నారు. అయితే దీన్ని ప్రభుత్వం పట్టించుకోలేదని తెలిపారు. రిజర్వేషన్లలో వ్యత్యాసాల కారణంగా నష్టపోయిన దాదాపు 6,800 మంది అభ్యర్థులకు ఉద్యోగాలు ఇచ్చే దిశగా ప్రభుత్వం చిత్తశుద్ధితో అడుగులు వేయడం లేదని మండిపడ్డారు.

ఏమిటీ వివాదం?

69 వేల పోస్టుల భర్తీకి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం 2019, జనవరిలో అసిస్టెంట్ టీచర్స్ రిక్రూట్‌మెంట్ పరీక్ష(ఏటీఆర్‌ఈ)ను నిర్వహించింది. జనరల్ అభ్యర్థులకు 65 శాతం, ఎస్సీ/ఎస్టీ, ఓబీసీ అభ్యర్థులకు 60 శాతం మార్కులను కటాఫ్‌గా నిర్ణయించింది. ఫలితాల ప్రకటన తర్వాత ప్రభుత్వం తీసుకొన్న రిజర్వేషన్ ప్రమాణాల్లో వ్యత్యాసాలు ఉన్నాయని ఆరోపిస్తూ రిక్రూట్‌మెంట్ ప్రక్రియకు వ్యతిరేకంగా అభ్యర్థులు 2020, మేలో ఆందోళనలు చేశారు. దీనిపై ప్రభుత్వం వేసిన కమిషన్ దర్యాప్తులో కూడా ఇదే తేలింది. వ్యత్యాసాలను అంగీకరించిన ప్రభుత్వం.. అభ్యర్థుల డిమాండ్ మేరకు 2022, జనవరిలో 6,800 మంది జాబితాను విడుదల చేసింది. అయితే నియామకాలు మాత్రం చేపట్టలేదు. తర్వాత అసెంబ్లీ ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో ఈ నియామక ప్రక్రియ ఆగిపోయింది.

6 లక్షల పోస్టులు ఖాళీ

మరోవైపు యోగి సర్కార్ రాష్ట్రంలో ఖాళీల ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయడంలో అలసత్వం వహిస్తున్నదనే విమర్శలు వస్తున్నాయి. ప్రాథమిక విద్య, పోలీసు శాఖ, తదితర విభాగాల్లో దాదాపు 6 లక్షల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ పోస్టులను భర్తీ చేయాలని గత కొన్నేండ్లుగా యువత డిమాండ్ చేస్తున్నది. తాజాగా అసెంబ్లీ సమావేశాలు జరుగనున్న నేపథ్యంలో యువ మంచ్ స్టేట్ ఎగ్జిక్యూటివ్ సమావేశమైంది. సోషల్ మీడియా ద్వారా ఉద్యోగాల భర్తీ డిమాండ్‌ను ప్రభుత్వం దృష్టికి ఏ విధంగా తీసుకెళ్లాలనే దానిపై చర్చించారు. అదేవిధంగా ఈనెల మొదటి వారంలో ఆందోళన నిర్వహించాలని కూడా నిర్ణయం తీసుకొన్నారు. 6 లక్షల ప్రభుత్వ ఉద్యోగ ఖాళీలను భర్తీ చేస్తామనే హామీని ప్రభుత్వం ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే ఇవ్వాలని యువ మంచ్ డిమాండ్ చేసింది. అదేవిధంగా టీచర్ రిక్రూట్‌మెంట్ అభ్యర్థులపై పోలీసుల లాఠీచార్జిని కూడా ఖండించింది.

యూపీలో మొబైల్ టవర్ చోరీ

ప్రయాగరాజ్: యూపీ కౌశంబి జిల్లా ఉజ్జయినీ గ్రామంలో జనవరిలో ఏర్పాటు చేసిన 50 మీటర్ల మొబైల్ టవర్‌ను కొందరు దొంగలు మార్చిలో అపహరించారు. 10 టన్నుల బరువున్న ఈ టవర్‌ను కొంతమంది కంపెనీ ప్రతినిధులమని చెప్పి టవర్, దానికి అనుబంధంగా ఏర్పాటు చేసిన ఎలక్ట్రికల్ యూనిట్‌ను విప్పుకుని వ్యాన్‌లలో వేసుకుని దర్జాగా వెళ్లిపోయారు. కొన్ని రోజులకు ఇన్‌స్పెక్షన్‌కు వచ్చిన కంపెనీ ప్రతినిధి టవర్ లేకపోవడంతో లబోదిబోమంటూ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గురువారం పోలీసులు గ్రామానికి వచ్చి స్థానికుల నుంచి వివరాలు సేకరించారు.

యుద్ధ నౌకలో తొలి మహిళా కమాండింగ్ ఆఫీసర్

న్యూఢిల్లీ : యుద్ధ నౌకలో తొలి మహిళా కమాండింగ్ ఆఫీసర్‌ను నియమించినట్లు భారత నావికా దళం చీఫ్ అడ్మిరల్ హరి కుమార్ చెప్పారు. డిసెంబరు 4న నావికా దళ దినోత్సవాల సందర్భంగా ఆయన శుక్రవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ అన్ని స్థాయిల్లోనూ మహిళలను నియమించాలనేది నావికా దళం ఆశయమని చెప్పారు. గడచిన సంవత్సరంలో వ్యూహాత్మక జలాల్లో నేవీ యుద్ధ నౌకలు, జలాంతర్గాములు, విమానాలు అత్యున్నత స్థాయి కార్యకలాపాలకు సంసిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. మహిళా అగ్నివీరుల సంఖ్య 1,000 దాటిందన్నారు.

కోటాలో మరో విద్యార్థి ఆత్మహత్య

జైపూర్: రాజస్థాన్‌లోని కోటాలో నీట్ శిక్షణ పొందుతున్న విద్యార్థులు వరుస ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. తాజాగా నిషా యాదవ్(21) ఆత్మహత్య చేసుకున్నది. హాస్టల్‌లోని తన గదిలో ఫ్యాన్‌కు ఉరేసుకొని ప్రాణాలు తీసుకున్నది. రోజువారీ లాగే బుధవారం కూడా తన కుమార్తె నిషాతో మాట్లాడటానికి తండ్రి ప్రయత్నించారు. కానీ ఆమె ఫోన్ ఎత్తకపోవడంతో హాస్టల్ సిబ్బందికి ఫోన్ చేసి సమాచారం అందించాలని సూచించారు. సిబ్బంది ఆమె గదికి వెళ్లి తలుపుకొట్టినా తీయకపోవడంతో బద్దలు కొట్టి చూడగా ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించింది.

ఓడలో రూ.220 కోట్ల కొకైన్ పట్టివేత



పారాదీప్, డిసెంబర్ 1: ఒడిశాలోని పారాదీప్ పోర్టులో అధికారులు భారీగా మాదక ద్రవ్యాలు పట్టుకున్నారు. ఓ ఓడపై దాడి చేసిన అధికారులు రూ.220 కోట్ల విలువైన కొకైన్ స్వాధీనం చేసుకున్నారు. కస్టమ్స్ కమిషనరేట్ కథనం ప్రకారం పారాదీప్ పోర్టులో పనామాకు చెందిన కార్గో షిప్ వచ్చి ఆగింది. ఇక్కడి నుంచి డెన్మార్క్ వెళ్లాల్సిన ఈ ఓడలోని క్రేన్‌లో తెల్లటి పౌడర్‌తో ఉన్న కొన్ని ప్యాకెట్లను ఆపరేటర్ గమనించి, అది పేలుడు పదార్థంగా భావించి అధికారులకు తెలిపాడు. వారు 22 ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని పరీక్షకు పంపగా అది కొకైన్‌గా నిర్ధారణ అయ్యింది. అంతర్జాతీయ మార్కెట్‌లో దాని విలువ రూ.220 కోట్ల వరకు ఉంటుంది. దీంతో ఓడ సిబ్బందిని అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నట్టు కస్టమ్స్ అధికారులు తెలిపారు.

టీచర్‌ను ఎత్తుకెళ్లి.. తుపాకీ గురిపెట్టి పెండ్లి



పాట్నా, డిసెంబర్ 1: బీహార్‌లో కిడ్నాప్ పెండ్లిళ్లు ఇప్పటికీ జరుగుతున్నాయి. పదేండ్ల క్రితం ఓ సైనికుడిని ఇదే విధంగా అపహరించి, చేసిన పెండ్లిని పాట్నా హైకోర్టు రద్దు చేసింది. అయినప్పటికీ ఈ దారుణాలు ఆగడం లేదు. తాజాగా వైశాలి జిల్లా, రేపుర గ్రామంలో ఉత్క్రామిత్ మధ్య విద్యాలయంలో టీచర్‌గా పని చేస్తున్న గౌతమ్ కుమార్‌ను నలుగురు వ్యక్తులు ఎత్తుకెళ్లారు. దీంతో ఆయన కుటుంబ సభ్యులు బుధవారం రాత్రి రాస్తారోకో చేశారు. రాజేశ్ రాయ్ కుటుంబ సభ్యులు తమ కుమారుడిని ఎత్తుకెళ్లి, ఆయన కుమార్తె చాందినితో పెండ్లి చేశారని ఆరోపించారు. ఈ పెండ్లిని నిరాకరించినందుకు గౌతమ్‌ను శారీరకంగా హింసించారని చెప్పారు. దీనిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించామని పోలీసులు తెలిపారు.

'కనీసం 8 మంది పిల్లల్ని కనండి'



మాస్కో: రష్యా జనాభాను పెంచడానికి మహిళలు నడుంబిగించాలని అధ్యక్షుడు పుతిన్ పిలుపునిచ్చారు. కనీసం ఎనిమిది అంతకంటే ఎక్కువ మంది పిల్లలను కనాలని సూచించారు. ఉక్రెయిన్‌తో యుద్ధం కారణంగా రష్యా దాదాపు 3 లక్షల మందిని కోల్పోయినట్టు పలు సంస్థలు చెప్తున్న విషయం తెలిసిందే. మంగళవారం మాస్కోలో జరిగిన వరల్డ్ రష్యన్ పీపుల్స్ కౌన్సిల్ సమావేశాన్ని ఉద్దేశించి పుతిన్ మాట్లాడుతూ 'పాత కాలంలో మనవాళ్లు ఏడెనిమిది మంది పిల్లలను కనేవాళ్లు. కానీ మనం ఇప్పుడు ఆ సంప్రదాయాన్ని మరిచిపోయాం. కాబట్టి మన తాతలను చూసి మనం నేర్చుకోవాలి. వాళ్లలాగే ప్రస్తుత తరంవాళ్లు ఏడెనిమిది మంది పిల్లలను కనాలి. ఇలా చేయడం వల్ల కుటుంబం బలపడటమే కాకుండా దేశానికి ప్రయోజనం చేకూరుతుంది' అని పేర్కొన్నారు.